క్లుప్తంగా

కేసీఆర్ కప్.. మధుతండా కైవసం

హసన్‌పర్తి: కేసీఆర్ క్రికెట్ కప్‌ను 65వ డివిజన్ పరిధిలోని మధు తండా కైవసం చేసుకుంది. అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగిన పోటీల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలోని వర్ధన్నపేట, పర్వతగిరి, కాజీపేట, హసన్‌పర్తి, వరంగల్, హనుమకొండ, ఖిలా వరంగల్ పరిధిలో సుమారు 132 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌కు మధుతండా, జయగిరి జట్లు చేరాయి. అన్నాసాగరం శివారులోని మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మధు తండా విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.1,01,116, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.50,116 నగదు బహుమతి అందజేస్తామని అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ అరూరి రమేష్ తెలిపారు.

‘బాలలకు బంగారు భవిష్యత్ అందిస్తా’



కాజీపేట అర్బన్: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు అభయహస్తం వర్తింపజేసి బంగారు భవిష్యత్ అందిస్తానని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భరోసా ఇచ్చారు. జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సర్దార్, లక్ష్మి మృతి చెందారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం కొనసాగించే ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈక్రమంలో నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారుల సమాచారం తెలుసుకున్న చీఫ్‌విప్.. హనుమకొండ లష్కర్ బజార్‌లోని శిశుగృహలో వారిని చేర్పించారు. చిన్నారులకు అన్ని రకాల వసతులు కల్పించాలని జిల్లా బాలల రక్షణ అధికారి సంతోష్‌కు సూచించారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

మడికొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో మడికొండలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. మడికొండ సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాబాయి మహిళా శిశు కేంద్రం జిల్లా అధికారి జయశ్రీ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని డాక్టర్ ప్రీతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సిబ్బంది హేమారాణి, మంజుల, ప్రత్యూష, కస్తూరి, హఫీస్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కాజీపేట: చైతన్యపురి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు చివరి రోజు పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నది జలాలతో వేదపండితులు చక్రస్నానం చేయించారు. సప్త బావులు, సప్త నది జలాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేశారు. భక్తుల కోలాహలం మధ్య ఉత్సవమూర్తులతో పండితులు నృత్యాలు చేశారు. వేదపండితులు డాక్టర్ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజులుగా సాగుతున్న గణపతి హోమానికి పండితులు, భక్తులతో కలిసి కనుల పండువగా పూర్ణాహుతి నిర్వహించారు. కాలనీ మహిళలు, పిల్లలు సామూహిక భక్తి గీతాలను ఆలపించారు. 12 రకాల పదార్థాలను స్వామి వారికి భక్తులు నైవేద్యంగా సమర్పించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తిచేసిన పండితులు, బ్రాహ్మణోత్తములు, సన్నాయి మేళాలు వాయించిన కళాకారులకు దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డేపల్లి నరేందర్ నూతన వస్త్రాలు, కానుకలు అందజేసి సన్మానించారు.

క్రీడాకారులకు అభినందనలు

హసన్‌పర్తి: ఇంటర్ స్టేట్ ఓపెన్ మార్షల్ చాంపియన్ – 2023లో ప్రతిభ కనబరిచిన హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన క్రీడాకారులు రన్వి, రిషిత, ప్రజ్ఞ, వి.సాయి హర్షిణి, మహేందర్‌రెడ్డి, పర్వేజ్‌ను స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

హసన్‌పర్తి: విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హసన్‌పర్తి మండలం ఎల్లాపురం శివారులోని ఆర్బిట్ టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మోటివేటర్ సంద్ర సుధీర్‌కుమార్ హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలో ఉందని అన్నారు.

నిబంధనలు బేఖాతర్

- అనుమతి లేకుండానే ఇటుక బట్టీల దందా
- అక్రమంగా చెరువుల్లో మట్టి తవ్వకం
- పన్ను చెల్లింపులో బురిడి
- పట్టించుకోని అధికారులు



తిమ్మంపేటలో నిల్వచేసిన చెరువు మట్టి



దుగ్గొండి : గ్రామీణ ప్రాంతాలలో ఇటుక బట్టీల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండానే బట్టీలు నిర్వహిస్తున్నారు. సరైన నిబంధనలు లేకుండానే ఇటుకబట్టీలు ఏర్పాటు చేస్తూ మాఫీయాగా తయారయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకువచ్చి వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చేయించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 42గ్రామాలలో ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. ఇటుక బట్టీలు నిర్వహించాలంటే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల నుంచి అనుమతి పొందాలి. బట్టి నిర్వహణకు ఉపయోగించే భూమికి నాలా పన్ను చెల్లించాలి. చెరువుల్లో మట్టి తీసుకోవడానికి ఇరిగేషన్ మైనింగ్ శాఖ అనుమతి, విద్యుత్‌ను ఉపయోగించడానికి ట్రాన్స్‌కో అనుమతి తప్పనిసరి. స్థానిక సంస్థలకు రాయల్టీ చెల్లించాలి. కానీ ఎక్కడా ఏ ఒక్కరూ అనుమతి తీసుకున్న దాఖలాలు లేవు. చెరువుల్లోని నల్లమట్టిని అక్రమంగా తరలించి గుట్టలుగా పోస్తున్నారు. ఉచిత కరెంట్‌నే వాడుతున్నారు. భూమికి రైతుబంధు పొందుతున్నారు. వ్యాపారంపై స్థానిక గ్రామ పంచాయతీలకు రాయల్టీ చెల్లించడం లేదు. ఇంత తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట, ముద్దునూరు, కేశవాపురం గ్రామాల పరిధిలో ఇటుక బట్టీల నిర్వహణ గత కొన్ని సంవత్సరాలుగా సాగుతోంది. ఇక్కడ ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలు పనిచేస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. బట్టీల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి. చెరువుల్లోని మట్టిని తీయడానికి కలెక్టర్ అనుమతి పొందాలి. ఒక అడుగు నుంచి మూడు అడుగుల లోతు వరకే మట్టిని తీయాలి. బోరుబావి నీటిని వాడాలంటే వ్యవసాయ కనెక్షన్ కాకుండా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ తీసుకోవాలి. వ్యాపార ఆదాయంపై ప్రభుత్వానికి ఆదాయ పన్ను చెల్లించాలి. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలి. లేబర్ యాక్ట్ ప్రకారం వేతనం చెల్లించాలి. అయితే ఒక్కో బట్టీ వద్ద వేలాది ట్రిప్పుల మట్టి దిబ్బలు చూస్తుంటే ఎన్ని చెరువులు తవ్వారో తెలియడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బట్టీలకు అనుమతి లేదు



మండలంలోని ఏ గ్రామంలోనూ ఇటుక బట్టీల నిర్వహణకు అనుమతి లేదు. నాలా పన్ను చెల్లించలేదు. రెవెన్యూతో పాటు వివిధ శాఖల అనుమతులు కలిగి ఉండాలి. గ్రామాలల్లో తనిఖీలు చేపట్టి బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

–సంపత్‌కుమార్, తహసీల్దార్, దుగ్గొండి

నాగరాజుపల్లిలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

నల్లబెల్లి : హనుమకొండకు చెందిన జనతా ఆస్పత్రి యజమాన్యం మండలంలోని నాగరాజుపల్లిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నాగరాజుపల్లి, మామిండ్ల వీరయ్యపల్లి జంట గ్రామాలతో పాటు సమీప గ్రామస్తులు వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శరణ్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ శ్రీదేవి మాట్లాడుతూ.. జనతా ఆస్పత్రి యజమాన్యం ఉచిత వైద్యసేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమ, శ్రవణ్, వినయ్, ఉమేష్, శ్రీధర్, స్థానిక యూత్ సభ్యులు రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న మిత్రులు

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన దొంగల రాజుకుమార్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని స్వగృహం చేరుకున్నారు. దీంతో 2003–04 జాగృతి హైస్కూల్‌లో పదోతరగతి పూర్తి చేసుకున్న స్నేహితులు ఆదివారం పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పల్లకొండ తిరుపతి, వల్ల వేణు, పులిశేరు రాజేందర్, కెంచ ప్రవీణ్, కర్రె రాజుకుమార్ వైనాల రాజు, శ్రీనివాస్, కుమారస్వామి, కార్తిక్, రాజేందర్ రెడ్డి, జగదీష్ తదితరులు ఉన్నారు.

‘కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి’

చెన్నారావుపేట : నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో గ్యాస్ సిలిండర్ రూ.410 ఉంటే నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రూ.1,155లకు పెంచి పేదలపై అధిక భారం మోపిందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో నేడు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందన్నారు. మాటలతో మాయచేసే సీఎం కేసీఆర్ మోదీతో కుమ్మక్కై రాష్ట్ర ప్రజలపై జీఎస్టీ పేరుతో రూ.293 అదనంగా వసూళ్లు చేస్తు సామాన్యులపై అదనపు భారం వేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500 లకే గ్యాస్ అందిస్తుందని అన్నారు.

మైనార్టీ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

శాయంపేట : మైనార్టీ దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టీఆర్‌వీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ మున్నా కోరారు. అన్సారీని చైర్మన్‌గా సీఎం కేసీఆర్ నియమించిన క్రమంలో మున్నా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి సమస్యలను అన్సారీ దృష్టికి తీసుకెళ్లారు. మైనార్టీ దివ్యాంగులకు అండగా నిలవాలని కోరారు.

వెంకటపాలెం చెరువుకు మత్తడి



మత్తడి పోస్తున్న వెంకటపాలెం చెరువు

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపుల వెంకటపాలెం చెరువు మత్తడి పోస్తోంది. యాసంగి పంటలకు అధికారులు ఎస్సారెస్పీ డీబీఎం–38 కాల్వకు నీరు విడుదల చేయగా చెరువులోకి నీరు చేరి నిండుకుండలా తలపిస్తుంది. చెరువు పూర్తిగా నిండి అలుగు పోస్తుండడంతో ఆయకట్టు రైతులు, మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు ఆయకట్టు 250 ఎకరాలు ఉండగా, అనధికారికంగా మరో 100ఎకరాల వరకు సాగవుతుంది. చెరువు మత్తడి కాల్వ ద్వారా నీరు ప్రవహిస్తుండడంతో నల్లబెల్లి మండలంలోని ముచ్చింపుల, నల్లబెల్లి, లెంకాలపల్లి, నందిగామ గ్రామల రైతులతో పాటు దుగ్గొండి మండలంలోని గుడ్డెలుగులపల్లి, ముద్దునూరు, నీరుకుళ్ల రైతుల పంట పొలాలకు యాసంగికి సైతం సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1997–98 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి విద్యార్థులు పాఠశాలకు చేరుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. తమ ప్రస్తుత పరిస్థితి, కుటుంబం, ఇతర వివరాలు చెప్పి సంతోషంగా గడిపారు. నాడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు కై లాసం, దయాకర్‌రెడ్డి, వేణు గోపాలచారి, సదానందచారి, దుర్గేశం, విజయలక్ష్మిలను శాలువాలు కప్పి జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మహేందర్‌రెడ్డి, రవికుమార్, వేణు, రవీందర్, సరస్వతి, పద్మ, శారద, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ఉన్నత పాఠశాలలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994 –95 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాం నర్సింహచార్యులు మాట్లాడుతూ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఓడెల నరేందర్, చెన్నూరి రవిచంద్ర, సురేందర్, రామకృష్ణ, పెద్దమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

జాతీయ నాయకుడు మురళీధర్ గౌడ్

దామెర : రానున్న ఎన్నిల్లో బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ జాతీయ నాయకుడు, జిల్లా బూత్ సశక్తికరణ్ అభియాన్ కమిటీ సభ్యుడు మురళీధర్ గౌడ్ ఆకాంక్షించారు. మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా మురళీధర్ హాజరై మాట్లాడారు. బీజేపీని పటిష్టపర్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ముఖ్య సలహాదారు, పరకాల నియోజకవర్గ పాలక్ వెదిరె శ్రీరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, గుజ్జ సత్యనారాయణ, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొండి జితేందర్‌రెడ్డి, ఆర్పీ. జయంత్‌లాల్, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్, తదితరులు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

పొదుపు సంఘం వార్షిక మహాసభ



పూలమాల వేస్తున్న సంఘం సభ్యులు

నర్సంపేట : పట్టణంలోని 19వ వార్డులో గల పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకార సంఘం (పరిమిత) 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపకుడు రాజగోపాల్, డీపీ వసుంధర, ఇందిరా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి డైరెక్టర్ అనుముల రమేష్ సంఘంలో ప్రతీ సభ్యుడు సరైన సమయంలో సంఘ నిబంధనలకు లోబడి పొదుపులో అప్పులు బకాయిలు లేకుండా చెల్లించి సంఘాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కక్కెర్ల రమేష్, ఉపాధ్యక్షుడు బోయిని మహేష్, ఇతర సంఘాల అధ్యక్షులు ముత్యాల వీరస్వామి, ముత్తినేని వీరస్వామి, భీమ్‌గౌడ్, పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే భూములు సాధించాలి



మాట్లాడుతున్న శారద

చెన్నారావుపేట : పేదలకు భూమి కావాలంటే పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి మొగిలోజు శారద అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగగిరిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేసిన గుడిసె వాసులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములలో పేదలు నివాసం కోసం గుడిసెలు వేసుకుంటే వాటిని దౌర్జన్యంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు అండగా ఎర్రజెండా ఎప్పుడు ఉంటుందని ఆమె అన్నారు. ప్రజలకు కనీసం ఉండటానికి గూడు, కనీస సౌకర్యాలు కల్పించే పరిస్థితిలో ఈ ప్రభుత్వాలు లేవని విమర్శించారు. గుడిసెలు వేసుకున్న ప్రతి పేద కుటుంబానికి స్థలం కేటాయించి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పసునిటి స్వామి, పోగుల అశోక్, మంజుల, కొయ్యడి జ్యోతి, అలివేలు, రాధా, కౌసల్య, కొమురమ్మ ఉన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న పట్టణవాసులు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లోని ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంతో పేద ప్రజలు ప్రతీ సంవత్సరం రూ.5లక్షలు హెల్త్ పరంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే విధంగా ప్రవేశపెట్టారన్నారు. రెండు సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా అడ్డుకుందన్నారు. బీజేపీ పట్టణ నాయకులు ప్రతీ బూత్‌లో మీ సేవ వారి సహకారంతో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌పాండ్య, ప్రవీణ్, చక్రపాణి, సుధాకర్, రవి, రమేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బొడ్రాయికి వినతి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న యువకులు

వర్ధన్నపేట : మిగులు నిధులు ఉన్న నిర్వాహకులు బొడ్రాయి తిరుగు పండుగ చేయక పోవడంతోనే పట్టణానికి అరిష్టం పట్టిందని ఆరోపిస్తు వర్ధన్నపేట పట్టణ యువత ఆదివారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి బొడ్రాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక యువత మాట్లాడుతూ.. 2012లో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో పాత బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన చేయడానికి ఊరి ప్రజల సహకారంతో కమిటీ ఏర్పడిందన్నారు. ఈ కమిటీ గ్రామంలోని ప్రతి తలకి రూ.50 చొప్పున వసూలు చేశారన్నారు. మరికొంత మంది దాతలు సహకరించడంతో అప్పట్లో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం పూర్తయిందన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత మిగిలిన డబ్బులను బొడ్రాయి కమిటీ సభ్యులైన గుజ్జ కమలాకర్‌రావు, శ్రీరాం రాంచందర్, కొండేటి సత్యంల పేర జాయింట్ అకౌంట్ తీసి బ్యాంకులో జమచేశారన్నారు. ఆచారం, ఆనవాయితీ ప్రకారం అప్పట్లోనే బొడ్రాయి తిరుగు పండుగ చేయాల్సి ఉండేదన్నారు. నిధులు ఉన్నప్పటికీ బొడ్రాయి తిరుగు పండుగ నిర్వహించక పోవడం బాధాకరమని తెలిపారు. పండుగ చేయక పోవడంతోనే ఊరికి అరిష్టం పట్టిందని, ఏమాత్రం మంచి కావడం లేదనే అభిప్రాయం పట్టణ కేంద్రంలో విస్తృతంగా ప్రచారంలో ఉందన్నారు. మిగులు నిధులు 12 సంవత్సరాలుగా ఎవరివద్ద ఉన్నాయో అప్పటి కమిటీ సభ్యులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి ఫిరంగిగడ్డ వరకు ప్లకార్డులతో నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా బొడ్రాయి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ యువత అధిక సంఖ్యలో పాల్గొనగా కొందరు కౌన్సిలర్లు మద్దతు పలికారు.

జాతీయ రహదారిపై మొక్కజొన్న సాగు





అసంపూర్తి రోడ్డు నిర్మాణంపై రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట

పర్యవేక్షించని అధికారులు

ఖానాపురం : జాతీయ రహదారి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేయడంతో రైతులు మొక్కజొన్న పంట సాగుచేస్తున్నారు. ఖానాపురం మీదుగా జాతీయ రహదారి వస్తుండటంతో అందరూ సంతోషపడ్డారు. ఈ క్రమంలో మంగళవారిపేట శివారు వేపచెట్టుతండా పరిధిలో జాతీయ రహదారి నిర్మాణ పనులు ఆగిపోయాయి. రైతులకు పరిహారం ఇవ్వడంలో, రోడ్డుకు మధ్యలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని నిర్మించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేశాడు. ఇంకేముంది నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్నా జిల్లా అధికారులతో పాటు మంత్రులు, జాతీయ నిర్మాణ పనుల పర్యవేక్షణ చేసే అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టాల్సిన సమయం ముగిసినా పదే పదే అదే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్నప్పటికి పనులు మాత్రం సాగడంలేదు. వేపచెట్టుతండా శివారులో అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డుపై మట్టి, కంకరపోసి వదిలేశారు. పరిహారం అందకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఓ అడుగు ముందుకు వేశారు. రోడ్డు కోసం మట్టిపోసి నిర్మాణం చేపట్టాల్సి ఉన్న దానిపై రైతులు మొక్కజొన్న పంటలు సాగు చేశారు. ఇంకేముంది జాతీయ రహదారి పనులు అటకెక్కాల్సిందేనని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోని నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపడతారో చూడాల్సిందే..

అనుదీప్ శర్మకు సువర్ణ కంకణ అవార్డు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని శ్రీ రాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు తాటిపాముల అనుదీప్ శర్మ ఉగాది మహోత్సవ వేడుకల్లో సువర్ణ కంకణ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో సీవీ రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ), రుద్రాక్ష వైభవం అధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 27వ సంవత్సర ఉగాది మహోత్సవాల్లో అనుదీప్ శర్మ అవార్డు అందుకున్నారు. పెద్దకోడెపాక గ్రామంలో కాకతీయ కాలంలో నిర్మించిన శివాలయాన్ని అభివృద్ధి చేయడంలో, కాలసర్ప దోషాలు నివారించేలా పూజలు చేస్తూ భక్తులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు, ప్రశంస పత్రాన్ని అందజేసి సువర్ణ కంకణాన్ని అలంకరించి అభినందించారు.

పొదుపుతో ఆర్థికాభివృద్ధి

శాయంపేట : సంపాదించిన డబ్బులో నుంచి కొంత పొదుపు చేసుకోవడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధించగలమని శ్రీ వెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ స్పష్టం చేశారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 18వ వార్షిక మహాసభకు ఉస్మాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2005లో 105 మంది సభ్యులు, రూ.10,500తో సంఘం ప్రారంభమై ప్రస్తుతం 266 మంది సభ్యులతో సొంత భవనం కలిగి రూ.56 లక్షల నిధులతో అభివృద్ధి పథంలో సాగుతోందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ ఆర్థిక అవసరాలుంటాయని చెప్పారు.